సాక్షి కామారెడ్డి

శనివారం । 4 । మే । 2024



కుండిలో పడి చిన్నారి మృతి

మహమ్మద్‌నగర్ మండలం గాలీపూర్‌లో ఏడాదిన్నర వయస్సు గల చిన్నారి సాయి ప్రియ నీటి కుండిలో పడి మృతి చెందింది.

- IIలో ▸



హోం ఓటింగ్‌ను..

పార్లమెంట్ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సూచించారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం

43.8 /24.8

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కూలీల కనీస వేతనం పెంచాలి



కామారెడ్డి క్రైం: మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు అవసరమైన వివిధ పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పిస్తూ.. కనీస వేతనం 300 చెల్లించేలా చూడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో చందర్ నాయక్‌తో కలిసి కూలీల హాజరు శాతం, కనీస వేతనం, పని ప్రాంతాల్లో సౌకర్యాలపై ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని మండలాల్లో కూలీల హాజరు, కనీస వేతనం చాలా తక్కువగా ఉందన్నారు. రాబోయే వారం రోజుల్లోగా సమీక్షించి హాజరుశాతం, కనీస వేతనం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా పనిచేసే చోట టెంట్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు



కామారెడ్డి క్రైం: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు గాను కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేశామని ఆర్డీవో రంగనాథరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు 4 ,5 తేదీల్లో, ఇతర పోలింగ్ సిబ్బంది 6, 7 తేదీల్లో తమ పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. నియోజక వర్గంలో 2167 మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించనున్నారని తెలిపారు. తహసీల్దార్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు ఈవీఎంలు



కామారెడ్డి క్రైం: ఈవీఎంలను అసెంబ్లీ నియోజకవర్గాలకు రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్గో బస్సుల్లో పంపారు. ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. జుక్కల్ నియోజకవర్గానికి 319, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి 338, కామారెడ్డి నియోజకవర్గానికి 333 చొప్పున కేటాయించిన ఈవీఎంలను భారీ భద్రతతో పంపించారు. కార్యక్రమంలో పార్టీల ప్రతినిధులు నరేందర్, కాసీంఅలీ, ఎన్నికల విభాగం అధికారులు ఉమలత, ఇందిరా ప్రియదర్శిని, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

పది కళాశాలల్లో 'గుర్తింపు' తనిఖీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పరిధిలో యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కళాశాలల తనిఖీలు శుక్రవారం కొనసాగాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ నేతృత్వంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ(వర్ని), విజయ డిగ్రీ కాలేజీ (వర్ని), బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీ కాలేజీ, ఎస్‌ఎస్‌ఎల్ డిగ్రీ కాలేజీ, శశాంక్ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(బిచ్కుంద), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(మద్నూర్), రత్న డిగ్రీ కాలేజీ (మద్నూర్), రెయిన్‌బో డిగ్రీ కాలేజీ (జుక్కల్), ఎస్‌వీ డిగ్రీ కాలేజీ (పిట్లం)లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనల మేరకు వసతి, సౌకర్యాలు లేని కళాశాలలకు నోటీసులు అందజేసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఎన్నికలకు భారీ భద్రత



- ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేస్తాం
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ సింధుశర్మ

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో లాగే పార్లమెంట్ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎస్పీ సింధుశర్మ అన్నారు. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎక్కడా అల్లర్లకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లాలో పరిస్థితులు, పోలీసు శాఖ సన్నద్ధతపై మాట్లాడారు. జిల్లాలో 576 లొకేషన్లలో 913 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, అన్ని బూత్‌ల వద్ద కావాల్సిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ వివరించారు. అసెంబ్లీ ఎన్నికల అనుభవంతో పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు ఉన్నాయని ఆయా కేంద్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. 13న జరిగే పోలింగ్ కోసం ముందురోజు పోలింగ్ సిబ్బంది ఈవీఎంలతో సహా వెళతారని, తిరిగి పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ కేంద్రాలకు బాక్సులు చేరుకుని, ఆ తర్వాత సంగారెడ్డి సమీపంలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసిన గీతం కాలేజీ వరకు బాక్సులు చేరేదాకా పోలీసులు భద్రతగా ఉంటారని తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీల్లో 85 కేసులు

నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు తీసుకెళ్తున్న సంఘటనలకు సంబంధించి జిల్లాలో 85 కేసులు నమోదయ్యాయని ఎస్పీ చెప్పారు. రూ. 1.90 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యానికి సంబంధించి 182 కేసులు నమోదయ్యాయని, 6,485 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. అలాగే ఆరు కిలోల గంజాయి, అల్ప్రాజోలం పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న 90 గ్రాముల బంగారాన్ని కూడా సీజ్ చేసినట్లు వివరించారు. మొత్తంగా రూ. 1.87 కోట్ల విలువైన నగదు, బంగారం సీజ్ చేసినట్లు తెలిపారు.

94 రూట్లలో పర్యవేక్షణ

జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం 94 రూట్లను ఎంపిక చేసి, ఆయా రూట్లలో పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ వివరించారు. ఏఆర్ మొబైల్ టీంలు ఆయా రూట్లలో తిరుగుతాయన్నారు. కేంద్ర బలగాలతో భద్రత చర్యలు తీసుకుంటామని, అలాగే ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది సేవలను వినియోగించుకుంటామని వివరించారు. కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అలాగే మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల సరిహద్దుల్లో కూడా తనిఖీ కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు.

550 మంది బైండోవర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులు, వివిధ ఆరోపణలు ఉన్న వారిని 550 మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 3,500 మందిని ఏడాది కోసం బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఇందులో వంద మంది వరకు చనిపోయినట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో లైసెన్స్‌డ్ వెపన్స్‌ను హ్యాండోవర్ చేసుకోవడం జరిగిందని, పార్లమెంట్ ఎన్నికలు ముగిసేదాకా అవి పోలీసు శాఖ వద్దే ఉంటాయని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై రెండు కేసులు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. భిక్కనూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించిన సంఘటనతో పాటు, తాడ్వాయిలో డబ్బులు పంచారన్న ఫిర్యాదుపై ఒక కేసు నమోదైందన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగినా తమకు సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

మండుతున్న ఎండలు

- రామారెడ్డిలో అత్యధికంగా 45.4 డిగ్రీలు నమోదు
- జిల్లా అంతటా 40 డిగ్రీలపైనే..
- వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రికార్డులు సృష్టిస్తున్నాయి. ఆరెంజ్ జోన్ నుంచి రెడ్‌జోన్‌లోకి అడుగులు పడుతున్నాయి. శుక్రవారం జిల్లాలోని రామారెడ్డి మండల కేంద్రంలో పగటి ఉష్ణోగ్రత అత్యధికంగా 45.4 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. కాగా జిల్లా అంతటా 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 8 గంటలకే సూరీడు చుక్కలు చూపిస్తున్నాడు. మధ్యాహ్నం అడుగుబయటపెట్టే పరిస్థితి లేకుండాపోతోంది. సాయంత్రం వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఎండ తగ్గిన తర్వాత కూడా వేడిమి తగ్గకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బతో చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు.

గ్రామం	ఉష్ణోగ్రత				
రామారెడ్డి	45.4	ఎల్పుగొండ	43.6	పెద్దకొడప్‌గల్	42.5
బిచ్కుంద	44.7	హసన్‌పల్లి	43.6	ఇసాయిపేట్	42.5
దోమకొండ	44.6	సదాశివనగర్	43.5	మేనూర్	42.4
కొల్లూరు	44.2	పిట్లం	43.5	గాంధారి	42.3
పాతరాజంపేట	44.2	నస్రుల్లాబాద్	43.5	జుక్కల్	42.1
దోంగ్లీ	44.0	బీబీపేట	43.2	నాగిరెడ్డిపేట	41.8
తాడ్వాయి	43.9	మగ్దుంపూర్	43.1	సర్వాపూర్	41.8
అర్గొండ	43.9	లింగంపేట	42.9	రాంలక్ష్మణ్‌పల్లి	41.6
భిక్కనూరు	43.8	బొమ్మదేవ్‌పల్లి	42.8	పుల్కల్	41.4
బీర్కూర్	43.7	మాచాపూర్	42.7	సోమూర్	41.4
		లచ్చాపేట్	42.7	కామారెడ్డి కలెక్టరేట్	40.7

కలెక్టరేట్‌లో అర్ధరాత్రి ఉద్యోగి హల్‌చల్..!

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి సమయం కాని సమయంలో కార్యాలయానికి రావడమే కాకుండా రాత్రి విధులు నిర్వహిస్తున్న కొందరితో గొడవకు దిగి హల్‌చల్ చేసినట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కార్యాలయంలో ఓ గదిలో ఎన్నికలకు సంబంధించిన కంట్రోల్ రూంను కొద్ది రోజుల క్రితం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూం 24 గంటల పాటు పనిచేస్తుంది. షిఫ్టుల వారీగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు హాజరవుతున్నారు. వారు తమ పనిలో ఉండగా రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కలెక్టరేట్‌లోని ఓ ప్రధాన ఉన్నతాధికారి వద్ద పని చేస్తున్న మరో ఉద్యోగి అక్కడకు వచ్చాడు. అక్కడున్న రికార్డులను పరిశీలించబోయాడు. ఏమిటని ప్రశ్నించిన కంట్రోల్ రూం సిబ్బందిపై దుర్భాషలాడుతూ, దురుసుగా ప్రవర్తిస్తూ నానా హంగామా చేసినట్లు తెలిసింది. ఉదయం సదరు ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం కాగా కొందరు మధ్యవర్తిత్వం చేసి నచ్చజెప్పినట్లు సమాచారం. బాధిత ఉద్యోగులు విషయాన్ని ఉద్యోగ సంఘాల దృష్టికి తీసుకువెళ్లే యోచనలో ఉన్నారని తెలిసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

- మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం
- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్: రాబోయే మూడురోజుల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ సూచించారు. మానిటరింగ్ అధికారులు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 7 వరకు జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన టార్పాలిన్లు, గోనె సంచులను కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను అందించాలని ట్రాన్స్‌పోర్ట్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎటువంటి ఆలస్యం చేయకుండా రాత్రి కూడా కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి ట్యాగ్‌చేసిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అందరూ డిప్యూటీ తహసీల్దార్లు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తూ వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. కేంద్రాల ఇన్‌చార్జీలు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్‌మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించే వరకు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు, మానిటరింగ్ అధికారులు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రచార హోరు

- జిల్లాకు ఇద్దరు అగ్రనేతలు
- 6న కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ
- హాజరుకానున్న ప్రియాంక గాంధీ
- 7న కామారెడ్డిలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర
- జనసమీకరణపై పార్టీల దృష్టి





సాక్షి, కామారెడ్డి: సార్వత్రిక ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంపై ఫోకస్ చేసిన బీజేపీ నాయకత్వం సంగారెడ్డి-కామారెడ్డి జిల్లాలకు మధ్య అందోల్‌లో ప్రధాని మోదీతో సభ నిర్వహించింది. కాంగ్రెస్ నాయకత్వం ఏఐసీసీ నేత ప్రియాంక గాంధీ సభ కోసం ఎల్లారెడ్డి అనుకున్నా తర్వాత కామారెడ్డికి మార్చారు. ఈ నెల 6న కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేశారు. అలాగే ముందే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 7న కామారెడ్డి పట్టణంలో రోడ్‌షో అనంతరం సుభాష్‌రోడ్డులో జరిగే సభలో ప్రసంగిస్తారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 6న కామారెడ్డిలో నిర్వహించనున్న సభకు భారీ జనసమీకరణ చేయడానికి పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. కామారెడ్డితో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించాలని ప్లాన్ చేస్తున్నారు. సభకు ప్రియాంక గాంధీ హాజరుకానున్న నేపథ్యంలో పెద్దఎత్తున జనాన్ని సమీకరించాలని నేతలు భావిస్తున్నారు. అలాగే మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 7న కామారెడ్డికి చేరుకోనున్న నేపథ్యంలో కామారెడ్డిలో నిర్వహించే రోడ్‌షో, సభలకు భారీగా జనాన్ని సమీకరించేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్దన్, జాజాల సురేందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌లు రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ర్యాలీకి భారీ జనాన్ని సమీకరించడం ద్వారా సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

నేతలు బిజీబిజీ

నెల రోజులుగా ప్రధాన పార్టీలు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు సన్నద్ధం చేశాయి. తర్వాత అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నాయి. పబ్లిక్ మీటింగ్‌లు, కార్నర్ మీటింగులు నిర్వహించాయి. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరపున ప్రభుత్వ సలహాదారు కామారెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తు న్నారు. ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకోవడం ద్వారా బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ నియోజకవర్గంలో నిత్యం బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలతో మాట్లాడుతున్నారు. జుక్కల్‌లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు విస్తృతంగా పర్యటిస్తున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగుతోంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబొద్దీన్ నియోజక వర్గం అంతటా తిరుగుతున్నారు. ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సిందే, బాన్సువాడలో నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

బీజేపీకి సంబంధించి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల ఇన్‌చార్జీ బాధ్యతలు మోస్తున్నారు. ఆయన నియోజకవర్గమే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎల్లారెడ్డిలో బీజేపీ నేతలు బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డిలు ప్రచారం నిర్వహిస్తున్నారు. జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే అరుణతారతో పాటు ఇటీవలే పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గంగారాం కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగుతోంది.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- జహీరాబాద్ ఎంపీ స్థానం ప్రధానికి గిఫ్ట్‌గా ఇవ్వాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్: దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన కామారెడ్డి, రాజంపేట మండలాల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వికసిత భారత్ కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. గెలుపు ఖాయమైందని కానీ మెజార్టీ కోసమే కష్టపడుతున్నామన్నారు. కనీసం లక్షకు పైగా మెజారిటీతో గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులతో జహీరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లుగా భారత్ అన్ని రంగాల్లో ముందుకు దూసుకు పో యిందని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వా త ఇంకా అద్భుతమైన పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి, రాజంపేట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబ్బులు పంచుతూ పట్టుబడ్డ బీఆర్‌ఎస్ కార్యకర్త

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి శివారులో బీఆర్‌ఎస్ కార్యకర్త డబ్బులు పంచుతూ ఫాస్ట్ టీంకు పట్టుబడినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం రాత్రి తాడ్వాయిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రోడ్డు షో నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు తాడ్వాయి శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో మండలంలోని కన్‌కల్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సంతోష్‌రెడ్డి ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంచాడన్నారు. ఫాస్ట్‌టీం ఇన్‌చార్జి శివకుమార్ తన టీంసభ్యులతో పెట్రోలింగ్ చేస్తుండగా సంతోష్ రెడ్డిని పట్టుకున్నారని తెలిపారు. అతని వద్ద నుంచి రూ. 10,100 లతో పాటు బీఆర్‌ఎస్ కండువాను స్వాధీనం చేసుకున్నారని ఎస్సై చెప్పారు.



ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ ఖాళీ



షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు జేపీ సిద్ధాగౌడ్

- కాంగ్రెస్‌కు ప్రజల్లో అపూర్వ ఆదరణ
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

భిక్కనూరు: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పూర్తిగా ఖాళీ అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. కేవలం కేసీఆర్ కుటుంబీకులు, పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకున్న వారు మాత్రమే ఆ పార్టీలో ఉంటారని వ్యాఖ్యానించారు. శుక్రవారం మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు జేపీ సిద్ధాగౌడ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ భారీ మెజారిటీతో గెలుస్తారన్నారు. కేసీఆర్ తన హయాంలో రైతులకు మాయమాటలు చెప్పడం తప్ప వారికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, నేతలు దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మ్యాతరి నర్సింలు, బత్తుల బాగులు, జేపీ వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిషన్ భగీరథ నీటి పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని పలు తండాల్లో మిషన్ భగీరథ నీటిని క్వాలిటీ కంట్రోల్ అధికారి వరప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. బెజుగం చెరువుతండా, ఎర్రకుంట తండాల్లో ట్యాంకుకు వస్తున్న నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్, పంచాయతీ కార్యదర్శులు అనిత, సత్యనారాయణ తదితరులున్నారు.

సహకార సంఘం ఏకగ్రీవ ఎన్నిక



పిట్లం(జుక్కల్) : మండలంలోని చిన్నకొడప్గల్ సహకార సంఘంలో గతంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై సహకార సంఘం డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో శుక్రవారం సహకార సంఘంలో డైరెక్టర్ల సమక్షంలో డీసీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో డైరెక్టర్లు చైర్మన్‌గా నాగిరెడ్డిని, వైస్ చైర్మన్‌గా గంగాగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మండ్లు, జుక్కల్ ప్రచార కమిటీ అధ్యక్షుడు బోడ్లరాజు, ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, కృష్ణారెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివ, మల్లప్ప పటేల్, మోగలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వర్సిటీ అధికారుల తనిఖీ



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలను శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ అకాడమిక్ ప్రొఫెసర్ల బృందం తనిఖీ చేసింది. కళాశాలలో ఆయా విభాగాల రికార్డులను పరిశీలించారు. కళాశాలను అటానమస్ స్థాయికి తీసుకువచ్చిన సందర్భంగా కళాశాల అధ్యాపకులను అభినందించారు. విద్యతో పాటు వృత్తి నైపుణ్య కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీయూ డైరెక్టర్ ఆఫ్ అకాడమీ ఆడిట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్లు లావణ్య, ఆరతి, రాంబాబు, సంపత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గులామ్ ముస్తాఫా, అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, అంబయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలి



మాచారెడ్డి: విద్యుత్ అంతరాయంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఆపరేషన్ రమేశ్‌బాబు సిబ్బందికి సూచించారు. శుక్రవారం పాల్వంచ మండలం ఎలుపుగొండ 33/11కేవీ సబ్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్లలో ఫీడర్ల వారీగా విద్యుత్ సరఫరాను పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు విద్యుత్ లైన్లు పరిశీలిస్తూ మరమ్మతులు చేపట్టాలన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మాధవరావు, సాలియ నాయక్, నరేశ్, లక్ష్మారెడ్డి, వేల్పుగొండ, వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- కూలీలకు ఎక్కువ డబ్బులొచ్చేలా పనులు చేయించాలి
- పీఆర్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



బూర్గుల్‌లో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ

గాంధారి(ఎల్లారెడ్డి): ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి జిల్లా ఉపాధిహామీ ప్రత్యేకాధికారి జాన్ వెస్లీ అన్నారు. కూలీలకు ఎక్కువ డబ్బులు వచ్చేలా పనులు చేయించాలని సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బూర్గుల్‌ను సందర్శించారు. ఉపాధి పని ప్రదేశాన్ని పరిశీలించి కూలీలతో మాట్లాడారు. పనులు జరుగుతున్న తీరును, పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోనిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గాంధారి, లింగంపేట్ మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి సిబ్బంది, కూలీల సంఖ్య పెంచాలని పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల అనుమతులను దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి నిర్ణీత గడువు కాలంలో అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ డిజిటల్ టోకెన్లను తమ వద్దనే ఉంచుకోవాలని, కంప్యూటర్ ఆపరేటర్ల వద్ద ఉంచకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధారి, లింగంపే ట్ మండలాల ఎంపీడీవోలు రాజేశ్వర్, సతీశ్, ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఏపీవోలు, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నర్సరీల్లో ఆకస్మిక తనిఖీ



మోడేగాంలో నర్సరీని పరిశీలిస్తున్న ఉపాధి హామీ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

రామారెడ్డి : సదాశివనగర్ మండలంలోని ఉపాధి హామీ పనులను, నర్సరీలను శుక్రవారం ఉపాధి హామీ డిప్యూటి కమిషనర్ జాన్ వెస్లీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మండలంలోని మోడేగాం గ్రామంలోని ఉపాధి హామీ పనులను, నర్సరీలను పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ వెంట జిల్లా డీఆర్‌డీవో చందర్ ఉన్నారు. తనిఖీల్లో భాగంగా మోడెగాం జీపీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలి



సమీక్షిస్తున్న జిల్లా నోడల్ అధికారి మాధవరావు

రామారెడ్డి : విద్యుత్ పొదుపుపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆ శాఖ కామారెడ్డి జిల్లా నోడల్ అధికారి మాధవరావు అన్నారు. శుక్రవారం విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లా నోడల్ అధికారి మాధవరావు సూపరింటెండెంట్ ఇంజినీర్ క్వాలిటీ కంట్రోల్ రామారెడ్డి విద్యుత్ ఉప కేంద్రాన్ని, ఏఈ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండల పరిధిలో నిర్వహించిన విద్యుత్ శాఖ అభివృద్ధి పనుల గురించి సమీక్ష నిర్వహించారు. తక్కువ అంతరాయాలతో నిరంతర విద్యుత్తును అందించిన మండల సిబ్బందిని అభినందించారు. విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేశ్ బాబు, డివిజనల్ ఇంజనీర్ సాలియా నాయక్, కామారెడ్డి రూరల్ సబ్ డివిజన్ ఇంజనీర్ నరేష్ కుమార్, రామారెడ్డి మండల ఏఈ లక్ష్మీ నరసింహ, సబ్ ఇంజనీర్ దివ్య తేజ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జహీరాబాద్‌పై కాంగ్రెస్ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న మాజీ ఏఎంసీ చైర్మన్ బాలకృష్ణ

బాన్సువాడ : జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని మాజీ ఏఎంసీ చైర్మన్ పాత బాలకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని భారత్ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. బాన్సువాడకు దళిత వాడకు చెందిన మల్లూరు సాయిలు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోరెల్ శ్రీనివాస్‌రావు, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, అలిబిన్‌అబ్దుల్లా, ప్రతాప్‌సింగ్, నార్ల రఘు, నార్ల సురేష్ తదితరులున్నారు. అనంతరం బీర్కూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

క్రైం కార్నర్

మంటలు అంటుకొని రైతు మృతి



కిషన్ (ఫైల్)

సిరికొండ: వరి కొయ్యలను కాల్చేందుకు నిప్పు పెట్టగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పోత్నూ ర్ గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన లాయిడి కిషన్(48)కు పోత్నూర్ శివారులో వ్యవసాయ భూమి ఉంది. తన పొలంలో వరి కొయ్యలను కాల్చేందుకు గురువారం మధ్యాహ్నం వెళ్లిన కిషన్ రాత్రి వరకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు, బంధువులు పొలం వద్ద గాలించారు.

తిరిగి శుక్రవారం ఉదయం వెళ్లి వెతకగా అక్కడ సజీవదహనమైన కిషన్ మృతదేహం కనిపించింది. కిషన్ చేతి కర్రసహాయంతో నడుస్తాడని, వరికొయ్యలకు అంటుకున్న మంటల్లో ఊపిరాడక నడవలేని స్థితిలో సజీవదహనమయ్యాడని భార్య లత పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు హర్షిణి, కౌశిక్ పిల్లలున్నారు.

ప్రమాదవశాత్తు ఒకరు..

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేటకు చెందిన నామాపురం శ్రీనివాస్(41) తన ఇంట్లో నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. గురువారం ఇంట్లో పని చేస్తున్న సమయంలో శ్రీనివాస్ కిందపడి మృతి చెందాడన్నారు. మృతుడి తల్లి నామాపురం నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటికుండిలో పడి చిన్నారి..



సాయిప్రియ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం గాలీపూర్ గ్రామానికి చెందిన పీట్ల గాయత్రి, సాయిబాబా దంపతుల ఏడాదిన్నర కూతురు సాయిప్రియ శుక్రవారం నీటి కుండిలో పడి మృతి చెందింది. కూలీ పనులకు వెళ్లివచ్చిన తల్లిదండ్రులు మధ్యాహ్నం వేళ ఇంట్లో ఉన్న సమయంలో సాయిప్రియ ఆడుకుంటూ వెళ్లి పక్కింటి వాకిట్లో ఉన్న నీటి కుండిలో పడి మృతి చెందింది. కూతురు కనిపించడం లేదని తల్లిదండ్రులు వెతుకుతుండగా నీటికుండిలో సాయిప్రియ కనిపించడంతో వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

పంట పొలాల్లో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ శివారులోని పంట పొలాల్లో శుక్రవారం మిట్టమధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. పంట నూర్పిడి చేసిన గడ్డి ద్వారా మంటలు ధాన్యం కొనుగోలు కేంద్రం, ఎల్లమ్మగుడి, గ్రామం వైపు వ్యాపిస్తుండగా అప్రమత్తమైన గ్రామస్తులు ఎల్లారెడ్డి, బాన్సువాడ అగ్నిమాపక శకటాలకు సమాచారం అందించారు. బాన్సువాడ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో గ్రామానికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది లింగం, మోసిన్‌ఖాన్, సుధాకర్, శ్రీనివాస్, సురేశ్‌తోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి బలరాముడు, కారోబార్ జంగం ప్రభాకర్‌ను గ్రామస్తులు అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. అనంతరం అనంతరం మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా..11 మందికి రూ. 12,800 జరిమానా విధించగా,మరొకరికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు.

నాలుగు టిప్పర్లు సీజ్



నందిపేట్(ఆర్మూర్): అధికలోడ్‌తో నల్లమట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఆర్టీఏ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు. టాక్స్ చెల్లించకపోవడంతో డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడం, అధిక లోడ్‌తో నల్లమట్టిని తరలిస్తుండడంతో అధికారులు టిప్పర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ సీనియర్ అధికారి వివేకానందరెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. తనిఖీల్లో సిబ్బంది దశరథ్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- మాల్తుమ్మెద శివారులో మూడు బైకులు ఢీ



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులో శుక్రవారం మూడు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురి కాళ్లు విరిగినట్లు స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వ్యక్తి మెదక్ నుంచి గోపాల్‌పేట్‌కు వస్తుండగా, రాఘవపల్లికి చెందిన వ్యక్తులు మెదక్ వెళ్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అదే సమయంలో మాల్తుమ్మెద నుంచి గోపాల్‌పేట్‌వైపు వస్తున్న ఎక్సెల్ వాహనం బైక్‌లను ఢీకొట్టింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మంజీర నదిలో మహిళ మృతదేహం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీర నదిలో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. ఘటనాస్థలాన్ని ఎస్సై పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల ఉంటుందని, నలుపు రంగు చీర, నీలి రంగు జాకెట్టు ధరించి ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు పిట్లం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

బోధన్‌రూరల్ : సాలురా మండల కేంద్రానికి చెందిన గైని గంగామణి (35) అనారోగ్యం కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శుక్రవారం తెలిపారు. కడుపునొప్పి బాధ భరించలేక గంగామణి బుధవారం పురుగుల మందు తాగిందన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయిందన్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపుపై దాడి

బాన్సువాడ రూరల్: బెల్టు షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో బొమ్మనదేవుని శ్రీనివాస్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని శుక్రవారం తనిఖీలు చేశామన్నారు. 2.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి



హోం ఓటింగ్‌కు బ్యాలెట్ బాక్స్‌లను అందజేస్తున్న ఆర్డీవో రమేశ్ నాయక్

మద్నూర్(జుక్కల్) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ హక్కును వినియోగించుకోవాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు పూర్తిగా అంగ వైకల్యం కలిగిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఫాం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ మూడు పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ : హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ ఆర్డీవో రమేశ్ నాయక్ సూచించారు. శుక్రవారం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో హోం ఓటింగ్ కోసం ఈవీఎంలను అందజేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓటును వేయిస్తారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 22 మంది దరఖాస్తులు చేసుకున్నారని, హోం ఓటింగ్ కోసం మొబైల్ బృందం వెళ్తుందన్నారు. తహసీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

రాత్రి కూడా ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలి

- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్‌వో

కామారెడ్డి టౌన్/రామారెడ్డి : రాబోయే మూడు రోజుల్లో జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో ధాన్యాన్ని రాత్రి సమయంలో కూడా లిఫ్ట్ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కామారెడ్డి, రామారెడ్డి మండలాలలోని వివిధ కొనుగోలు కేంద్రాలను, బాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా కామారెడ్డి మండలంలోని గర్గుల్ లో కేంద్రాన్ని, రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్, ఉప్పల్ వాయి, రామారెడ్డి లలో కొనుగోలు కేంద్రాలను, రెడ్డిపేటలోని భాగ్యలక్ష్మి బాయిల్డ్ రైస్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి అయి కేంద్రంలో వసతుల ఏర్పాట్లు, పేమెంట్ విషయమై ఆరా తీయగా ధాన్యం తూకం వేసిన మూడు రోజుల్లోగా ఖాతాలో డబ్బులు జమకావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ ఈ నెల 5 నుండి 7 వరకు వర్షాలు పడే సూచనలున్నందున ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండి ఎత్తు పల్లాలపై ధాన్యం ఉంచి టార్పాలిన్లు కప్పాలని, అధైర్యపడవద్దని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని రాత్రి పొద్దుపోయాక కూడా ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు, అదనంగా హమాలీలను ఏర్పాటు చేసుకొని లారీలు వచ్చిన వెంటనే ధాన్యం అన్ లోడ్ చేసుకోవాలని మిల్లర్ల కు సూచించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు కేంద్రాలలో అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ట్యాబ్ ఎంట్రీ 80 నుండి 85 శాతం అవుతుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ధాన్యం మిల్లులకు తరలించిన రెండు రోజులల్లోగా రైతుల ఖాతాలో డబ్బులు పడేలా చూడాలన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం



మాట్లాడుతున్న వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దేవుళ్లతో సమానమని, వారికి ఏ ఆపద వచ్చినా గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటామని పార్లమెంట్ ఎన్నికల జుక్కల్ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్, మహమ్మద్ నగర్, నర్వ, హసన్‌పల్లి, పిప్పిరేగడి తండాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్ ఉన్నారు.

ఆటో చోరీ

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నితీశ్‌కుమార్‌కు చెందిన ఆటో గురువారం రాత్రి చోరీకి గురైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో, ట్రెయినీ ఐపీఎస్ అధికారిణి చైతన్యరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నితీశ్‌కుమార్ జిల్లా కేంద్రంలో ఆటో నడిపి రాత్రి వేళలో ఇంటికి వెళ్తుండగా మల్కాపూర్ రోడ్డుపై చెడిపోవడంతో అక్కడే నిలిపి వెళ్లిపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆటో నిలిపిన స్థలానికి వెళ్లి చూడగా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మూత్రపిండాల సంబంధిత వ్యాధితో మృతి

కామారెడ్డి టౌన్: రాజంపేట మండలం కొండాపూర్‌కు చెందిన నీరడి ఎల్లవ్వ వడ దెబ్బ కారణంగా మృతి చెందలేదని, ఆమెకు మూత్రపిండాల సంబంధిత వ్యాధి ఉందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి లక్ష్మణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లవ్వ వడదెబ్బతో మృతి చెందినట్లు గురువారం మీడియాలో వార్తలు రావడంతో తాము విచారణ చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరోగ్యంగా ఉన్న ఎల్లవ్వ మేకల పెంపకం పనిలో నిమగ్నమై ఉండగా.. అకస్మాత్తుగా కుప్పకూలిందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందిందని తెలిపారు.

అడవి మామిడిపల్లిలో అగ్నిప్రమాదం

- ఆరు పూరి గుడిసెలు దగ్ధం
- రూ.6 లక్షల ఆస్తి నష్టం



అడవి మామిడిపల్లిలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఆరు పూరిగుడిసెలు దగ్ధమయ్యాయి. ఫైర్ ఇంజిన్ గ్రామానికి చేరుకొని మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దగ్ధమైన పూరిగుడిసెలు మాజీ సర్పంచ్ గంగోనే సంతోష్, ప్రణీత్, చిట్టెం గుణమంతు, శంకర్, శేఖర్, చిట్టెం చిన్నయ్యకు చెందినవి కాగా, అందులో ఇద్దరివి నివాసపు గుడిసెలు. మిగితా వాటిని వారివారి ఇళ్ల ఎదుట చల్లదనం కోసం నిర్మించుకొని ఫర్నిచర్‌తోపాటు ఇతర వస్తువులను భద్రపరిచారు. అగ్ని ప్రమాదంలో సామగ్రితోపాటు ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.6లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వీరన్నగుట్టలో..

రెంజల్(బోధన్): మండలంలోని వీరన్నగుట్టకు చెందిన గుంజి రజిత అనే మహిళకు చెందిన గుడిసె షార్ట్‌సర్క్యూట్ కారణంగా శుక్రవారం దగ్ధమైంది. రజిత కూలీపనికి వెళ్లగా ఆమె కూతురు గడియపెట్టి పక్కింట్లోకి వెళ్లింది. అదే సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసెకు నిప్పంటుకుంది. చుట్టుపక్కల వారు గమనించి గుడిసెలోని కొన్ని వస్తువులను బయటకు తీశారు. ఈ ఘటనలో రూ.10వేల నగదుతోపాటు దుస్తులు కాలిబూడిదయ్యాయి. రజితకు చెందిన గుడిసె దగ్ధం కావడం రెండోసారి అని, దాతలు, ప్రభుత్వం ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు.

అటవీభూమి దున్నిన ట్రాక్టర్ల పట్టివేత



మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్

రాజంపేట: మండల కేంద్రంలోని హద్దుగుండు సమీప అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా అటవీభూమిని దున్నిన రెండు ట్రాక్టర్లను ఫారెస్ట్ అధికారులు శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేశారు. అటవీభూమిని మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మాలోత్ లక్ష్మణ్, గౌసుద్దీన్ ట్రాక్టర్లతో దున్నారని రేంజ్ అధికారి రమేశ్ తెలిపారు. అనుమతులు లేకుండా అడవిడిలోని చెట్లను నరికినా, భూమిని దున్నినా కేసులు నమోదు చేస్తామన్నారు. సెక్షన్ ఆఫీసర్ సయ్యద్‌బాబా, బీట్ అధికారులు మహేశ్, లచ్చయ్య, రాజమణి, దేవేందర్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేట శివారులోని లొట్టివాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.